## నేడు ప్రజావాణి

**రాజేంద్రనగర్:** జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేసి సత్వర పరిష్కారానికి సహకరించాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మున్నూరు కాపు సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**మైలార్‌దేవ్‌పల్లి:** మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ మున్నూరు కాపు సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కాళిదాస్, ముఖ్య కార్యదర్శి గోవింద్‌రాజ్, కోశాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీబీఐటీలో 'ఈ-సమ్మిట్ రీజనల్స్'




సమ్మిట్‌లో పాల్గొన్న అతిథులు

**ఊమణికొండ:** గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో ఆదివారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, ఐఐటీ ఢిల్లీ, ఈడీసీ–సీబీఐటీ, ఇనిస్టిట్యూషన్స్, ఇన్నొవేషన్ కౌన్సిల్, ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్–సీబీఐటీ సహకారంతో బీఈ–కాన్ 2025లో భాగంగా ఈ–సమ్మిట్ హైదరాబాద్ రీజనల్స్‌ను నిర్వహించారు. ఇందులో 250 మంది విద్యార్థులు, 50 స్టార్టప్‌లు, 25 మంది న్యాయనిర్ణేతలు, మార్గదర్శకులు, ఐదుగురు పెట్టుబడిదారులు పాల్గొన్నారు. స్టార్టప్ క్లినిక్ (నెట్‌వర్కింగ్ అరెనా), బ్లూప్రింట్ (బిజినెస్ ప్లాన్‌కాంపిటీషన్) మూన్‌షాట్ (నిధుల కోసం పించింగ్ ట్యాంక్) వంటి ఈవెంట్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీఐటీ ఇన్నొవేషన్, ఇంక్యుబేషన్ సలహాదారు, ప్రొఫెసర్ ఉమాకాంత్ చౌదరి మాట్లాడుతూ... ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు, నిపుణుల మధ్య వ్యవస్థాపక సంస్కృతిని ప్రోత్సహిస్తుందన్నారు. వ్యాపారంలో వాస్తవ ప్రపంచ సవాళ్లు, పరిష్కారాల గురించి తెలుస్తుందన్నారు. డాక్టర్ పి.ప్రభాకర్‌రెడ్డి, వి.సంధ్య, పి.సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్పా కేంద్రంపై దాడి

**లంగర్‌హౌస్:** నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్పా కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బాలానగర్‌లో నివాసముండే బిలాల్ లక్ష్మీనగర్ పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 68 వద్ద స్పా మసాజ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా మగవారికి ఆడవారితో, ఆడవాళ్లకు మగవారితో మసాజ్ చేయిస్తున్నాడు. దీనికి తోడు వివరాల సేకరణ లేకుండా కనీసం సీసీ కెమరాలు కూడా ఏర్పాటు చేయకుండా డోర్లు మూసి మసాజ్ చేయిస్తున్నాడు. దీంతో శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు, లంగర్‌హౌస్ పోలీసులు కలిసి దాడి చేశారు. ఇద్దరు యువతులతో పాటు, ఇద్దరు మగవారిని, నిర్వాహకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ధర్మగిరి రోడ్డు–రైల్వే గేట్ రోడ్డు.. విస్తరణ తూచ్..!

- స్థానికుల నుంచి అభ్యంతరాల వెల్లువ
- రహదారి విస్తరణపై పునరాలోచన
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తున్న అధికారులు



ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వే గేటుకు వెళ్లే రహదారి

**శంషాబాద్:** శంషాబాద్ పట్టణంలోని ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రహదారి విస్తరణపై అధికారులు పునరాలోచనలో పడ్డారు. ప్రస్తుత రహదారిని 80 ఫీట్ల రహదారిగా విస్తరించేందుకు హెచ్ఎండీఏ సిద్ధం కాగా స్థానికులు నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రహదారి విస్తరణపై అధికారులు ప్రత్యామ్నాయం వైపే మొగ్గుచూపుతున్నారు.

### ఎందుకు..?

ధర్మగిరి రోడ్డు ఎరుకల గడ్డ నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రహదారి విస్తరణలో 208 మంది బాధితులున్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఇందులో కొందరి ప్లాట్లు, కొందరి ఇళ్లు పాక్షికంగా మరికొందరి ఇళ్లు పూర్తి స్థాయిలో కోల్పోయే అవకాశం ఉండటంతో రహదారి విస్తరణపై స్థానికులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. భారీగా ఆస్తులు కోల్పోయే వారికి ప్రత్యామ్నాయం ఎలా చెల్లిస్తారనే ప్రశ్నలూ వెల్లువెత్తాయి. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ రూపొందించకముందు నుంచీ స్థానికంగా నివాసాలున్నాయని అలాంటి వాటిని ఎలా తొలగిస్తారని కూడా ప్రశ్నిస్తున్నారు.

### పరిహారం కూడా...

ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం చెల్లించే విషయం కూడా గుదిబండగా మారుతుందనే ఆందోళన నెలకొంది. ఈ కారణంగా ప్రత్యామ్నాయ మార్గంలోనే రహదారిని చేపడితేనే ఎంతో మేలని మున్సిపల్ అధికారులు సైతం భావిస్తున్నారు. పరిహారం చెల్లింపు కన్నా ప్రత్యామ్నాయమే బెటర్ అనే అంశం కూడా ప్రస్తుతం తెరపై వచ్చింది.

### కీలక సమస్య...

ఈ రహదారి విస్తరణ చేపడితే రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే వాదనలున్నాయి. రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తే తప్ప రహదారి విస్తరణతో ఎలాంటి ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు కూడా స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పాత పోలీస్‌స్టేషన్ రహదారిలో కూడా ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న కారణంగా సంబంధిత రహదారి విస్తరణపై అధికారులు ఆలోచించాలనే వాదనలు కూడా లేకపోలేదు.

## కేన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కోవాలి

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**మైలార్‌దేవ్‌పల్లి:** కేన్సర్ బారినపడిన వారు ఆందోళన చెందకుండా ధైర్యంగా చికిత్స చేయించుకుంటే ఆ వ్యాధి తప్పక తగ్గుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఎలాంటి వ్యాధులకు అయినా ధైర్యమే సగం బలమని ఆయన స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పద్మశాలీపురంలోని మార్కండేయన భవన్‌లో కిమ్స్ ఆస్పత్రి ఆంకాలజీ విభాగం అధిపతి మధు దేవరశెట్టి ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ... ఇటీవలి కాలంలో యువత మద్యపానానికి బానిసవుతోందన్నారు. మద్యాన్ని అధికంగా సేవించడం, సిగరెట్లు తాగడం, గుట్కాలు తినడం తదితర అలవాట్లు అన్ని రకాల కేన్సర్‌లకు కారకాలని వైద్యులు చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. నిత్యం ఉదయం వ్యాయామాన్ని జీవితంలో భాగంగా అలవాటుగా చేసుకోవాలన్నారు. అయితే ఎంత జాగ్రత్తలు తీసుకున్నా అప్పుడప్పుడు వ్యాధులు ప్రబలడం సహజమేనని చెప్పారు. ఇలాంటి సమయంలో అనవసర ఆందోళన చెందకుండా ధైర్యంతో తగిన చికిత్స చేయించుకోవాలన్నారు. కిమ్స్ ఆస్పత్రి కేన్సర్ వైద్య నిపుణులు మధు దేవరశెట్టి మాట్లాడుతూ... సరైన అవగాహన లేక చాలా మంది కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. జీవనశైలిలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా కేన్సర్ దరి చేరకుండా జీవించవచ్చని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో ఎలాంటి క్యాన్సర్లనైనా తగ్గించే అధునాతన వైద్యం అందుబాటులో ఉందన్నారు. ఒకప్పుడు కేన్సర్‌కు ఆందోళన చెందేవారని ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అయితే కేన్సర్ బారినపడిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ఆ వ్యాధి దరి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. కిమ్స్ వైద్యులు స్థానికులకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు అన్వర్ అహ్మద్, కార్తీక్, ధనుంజయ్, గంజి వెంకటేష్, సరికొండ వెంకటేస్, మస్న వెంకటేష్, డి.వి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉడ్డెంగడ్డ రైల్వే బ్రిడ్జి పూర్తి చేయాలని సీపీఎం ధర్నా



ఉడ్డెంగడ్డ బ్రిడ్జి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి:** ఉడ్డెంగడ్డ రైల్వే బ్రిడ్జి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ఆ వంతెన వద్ద ఆదివారం ధర్నా చేశారు. గడచిన నాలుగేళ్లుగా కొనసాగుతున్న వంతెన పనులను సత్వరమే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నినదించారు. మైలార్‌దేవ్‌పల్లి ఉడ్డెంగడ్డ రైల్వేస్టేషన్ నూతన బ్రిడ్జి వద్ద సీపీఎం సీనియర్ నాయకులు వెంకటయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ... మైలార్‌దేవ్‌పల్లి ఉడ్డెంగడ్డ రైల్వే స్టేషన్ దగ్గర నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయడంతో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఇందుకు అడ్డుగా ఉన్న ఇళ్లను కూలగొట్టి రోడ్డును విస్తరించినా వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయడంలో జాప్యం దారుణమన్నారు. ఈ బ్రిడ్జి మైలార్‌దేవ్‌పల్లి నుంచి శాస్త్రీపురం, వట్టెపల్లికి వెళ్లే దారిలో నిర్మిస్తున్నారరని ఈ దారి మూసి వేయడంతో అక్కడున్న ప్రజలు మెయిన్ రోడ్డుకు రావాలంటే మొత్తం రౌండ్ తిరిగి వచ్చేసరికి 4 నుంచి 5 కిలోమీటర్లు అవుతుందన్నారు. పలుమార్లు స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చినందునే బ్రిడ్జిని సందర్శించి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్లు వెంటనే స్పందించి ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించి వెంటనే నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఒక వేళ పరిష్కారం చేయకపోతే బస్తీలో ఉన్న ప్రజలను ఏకం చేసి న్యాయపోరాటానికీ సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు ఎన్.జంగయ్య, బచ్చలకూర స్వామి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, భీమయ్య, చాంద్‌పాషా, ఇమ్రాన్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం



ఆరాధనోత్సవంలో పాల్గొన్న భక్తులు

**బండ్లగూడ:** బండ్లగూడ జాగీర్‌లో పరిధిలోని మురారి గిరిధారి గృహ సముదాయంలో ఆదివారం త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పుష్యబహుళ పంచమిన సంగీత కారులు, సంగీత ప్రియులు త్యాగరాజు పంచరత్న కీర్తనలు గోష్టి గానం చేసి వారి భక్తిని చాటుకున్నారు.

సంగీత ప్రియులు అక్కిరాజు శ్రీహరి ఆధ్వర్యంలో రామతారకం, హరిణి, లయక్ష, కాత్యాయని, పలువురు సంగీత కారులు, పిల్లలు త్యాగరాజు పంచరత్న కీర్తనలు, ఇతర కీర్తనలు గానం చేసి అలరించారు. చుట్టు పక్కల ఉన్న సంగీత కళాకారులకు ఇంటి పక్కనే ఆరాధన జరగటం చాలా ప్రోత్సాహకరంగా ఉందని గాయని హరిణి ప్రశంసించారు. కార్యక్రమంలో మురారి గిరిధిరి గృహ సముదాయం వాసులు పాల్గొన్నారు.

## సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



ప్రజల నుంచి విరాళాలను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి:** ఈ నెల 28వ తేదీ నుంచి జరగనున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ కోరారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యుడు భాస్కర్ అధ్యక్షతన ఆదివారం మర్కండేయనగర్, బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో మహాసభలకు అయ్యే ఖర్చు నిమిత్తం ఆర్థిక చేయూత అందించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ సీపీఎంను ఆదరిస్తున్నారన్నారు. ఈ మహాసభలు ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో జరుగుతాయన్నారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు ఎన్.జంగయ్య, బచ్చలకూర స్వామి, వెంకటయ్య, జి.ఎం.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు



ఈదమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న నాయకులు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ బుద్వేల్ గ్రీన్ సిటీ పోచమ్మ దేవాలయంలో వంశరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. వంశరాజ్ కులస్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనాలను నైవేద్యంగా సమర్పించారు. బోనాల జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా దేవాలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకొని బోనాలను సమర్పించారు. ఏటా సంక్రాంతి అనంతరం వంశరాజ్ కులస్తులు అమ్మవారికి బోనాలను సమర్పిస్తారు. జాతరలో వంశరాజ్ కులస్తులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అన్నపురెడ్డి భీమార్జున్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### ఈదమ్మ తల్లికి బోనాల సమర్పణ

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని ఈదమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి అనంతరం వచ్చే మొదటి ఆదివారం రోజున ఈదమ్మ తల్లి బోనాలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన రజకులు భారీ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెండ్యాల శ్రీధర్, శ్రీ శ్రీనివాస సేవా సమితి చైర్మన్ సాయి మల్లిక్, శ్రీధర్, శివ, ప్రదీప్, సన్నీ, రాజు, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వలస కార్మికులకు అన్యాయం చేస్తున్న నిర్మాణ సంస్థలు

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు**



మాట్లాడుతున్న పర్వతాలు

**మణికొండ:** బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్న బడా నిర్మాణ సంస్థలు వలస కార్మికులను నిలువునా మోసం చేస్తున్నాయని, వాటి యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం గండిపేట మండల భవన నిర్మాణ కార్మిక సంఘం మూడవ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిర్మాణ రంగ కార్మికలకు చట్ట ప్రకారం వేతనాలు చెల్లించకుండా, అతి తక్కువ వేతనాలు ఇచ్చి వారిని ఆర్థిక దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. మండల పరిధిలోనే లేబర్ అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలైన నీటి సౌకర్యం, మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మల్లేష్, జిల్లా కార్యదర్శి చందుయాదవ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కె.నర్సింహారెడ్డి, మండల నాయకులు స్వామి, బాబు రావు, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం.. మల్లన్న కల్యాణం





నార్సింగి జాతరలో మల్లన్నను దర్శించుకున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ తదితరులు

**మణికొండ:** నార్సింగి మున్సిపల్ పరిధిలోని శ్రీ మల్లికార్జునస్వామి సహిత కేతకి భ్రమరాంబా అమ్మవార్ల కల్యాణ మహోత్సవం ఆదివారం కనుల పండుగగా జరిగింది. ఉదయం గ్రామం నుంచి భక్తులు పెద్ద ఎత్తున గంపలతో దేవాలయానికి చేరుకున్నారు. 8 గంటలకు గోజూప, పుణ్యాహవచనం, గణపతి పూజ, 9 గంటలకు గణపతి హవనం, 11.05 గంటలకు కల్యాణ మహోత్సవం, సాయంత్రం 7 గంటలకు అగ్నిగుండాలు తొక్కటం, రాత్రి 8 గంటలకు సొడమ్మ బోనాలు, రాత్రి 9 గంటలకు మల్లన్న ఒగ్గుకథ నిర్వహించారు. దేవాలయ నిర్వహణ కర్త, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.ప్రసన్న అశోక్‌యాదవ్ దంపతులు వేద మంత్రోశ్చరణల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, వైస్ చైర్మన్ కె.దశరథయాదవ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.నగేష్‌యాదవ్, నాయకులు పాపిరెడ్డి, ప్రవీణ్‌యాదవ్, రాము, వినోద్‌కుమార్‌లతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అశోక్‌యాదవ్ దంపతులు

సోమవారం ఉదయం 11 గంటలకు నాగవల్లి, మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఎల్లమ్మ కల్యాణం, బోనాల ఉత్సవాలు ఉంటాయన్నారు. గండిపేట మండల పరిధిలోని మల్లన్న భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని అశోక్‌యాదవ్ కోరారు.

### కొత్వాల్‌గూడ మల్లన్న ఆలయంలో...

**శంషాబాద్:** కొత్వాల్‌గూడ మల్లన్న ఆలయంలో మల్లన్న జాతర వైభవంగా జరుగుతోంది. ఆదివారం మల్లన్న స్వామి కలాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. కల్యాణోత్సవానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానికంగా నిర్వహించుకునే జాతరలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాతర నిర్వాహకులు రాంచందర్‌యాదవ్, లింగమయ్య యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్‌యాదవ్, అంజయ్య, మహేష్ యాదవ్, గుర్రంపల్లి లింగం యాదవ్, బాబుల్ యాదవ్, జ్ఞానేశ్వర్ యాదవ్, జగదీశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.



కొత్వాల్‌గూడలో...

## కొనసాగుతున్న క్రీడా సాంస్కృతిక పోటీలు

**ఏజీవర్సిటీ:** శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న నాలుగవ క్రీడా సాంస్కృతిక పోటీలు రెండవ రోజు ఆదివారం కొనసాగాయి. అందులో భాగంగా విద్యార్థినీవిద్యార్థులకు వాలీబాల్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఇండోర్ గేమ్స్, క్యారమ్, చిత్రలేఖనంతో పాటు వివిధ రకాల కళాఖండాల తయారీ పోటీలనూ నిర్వహించారు. ఆయా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలు కాలేజీ గేమ్స్ కల్చరల్ చైర్మన్ పి.ప్రశాంత్, మాల్యాల కళాశాల డీన్ చీనా నాయక్, మోజర్ల కళాశాల డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, వెంకటలక్ష్మి, కళాధర్‌బాబు, షహనాజ్‌ల పర్యవేక్షణలో కొనసాగతున్నాయి.



వాలీబాల్ ఆడుతున్న ములుగు బాలికలు



అధ్యాపకులతో సాంస్కృతిక కళాకారుల టీం



విజేతలతో అధ్యాపకులు